నవతెలంగాణ

ఆదిలాబాద్

1

మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

సైకిల్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

కాసిపేట : మండలంలోని మద్దిమాడ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి కింద పడి గాసకంటి రాజయ్య(65) మృతి చెందినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... హాజీపూర్ మండలం సబ్బపల్లి గ్రామానికి చెందిన రాజయ్య 16న దేవాపూర్‌లో తన కుమారుడు మల్లేశ్ ఇంటికొచ్చాడు. కొత్త గడ్‌పూర్‌లోని తన స్నేహితుడైన సెద్మక సోనేరావును కలవడానికి సాయంత్రం 5 గంటలకు సైకిల్‌పై వెళ్లాడు. స్నేహితుడిని కలిసి రాత్రి 7గంటల సమయంలో కొడుకు ఇంటికి దేవాపూర్‌కు వస్తుండగా మార్గమధ్యలో మద్దిమాడ గ్రామ శివారులోని కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు సైకిల్ పైనుండి కింద పడి లేవలేకపోయాడు. తండ్రి కోసం కుమారుడు వెతుక్కుంటూ వెళ్లగా కల్వర్టు వద్ద కింద పడి ఉన్నాడు. వెంటనే దేవాపూర్ కంపెనీ అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించాడు. కుమారుడు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని ఫూలేనగర్‌కు చెందిన విద్యార్థిని కదం కోమల్(14) ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాయంత్రం వంటగది పైకప్పుకు గల ఇనుప రాడ్‌కు చీరతో ఉరేసుకుంది. గమనించిన సోదరి అరుపు, కేకలు వేస్తు బయటకు వచ్చింది. కుటుంబ సభ్యులు, ఇంటి చుట్టు వారు వెళ్లి చూడగా కొన ఊపిరితో ఉన్న విద్యార్థిని హుటాహుటిన ఆటోలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందింది. కాలనీ యువకుడి వేధింపులు కారణంగానే ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ గోపినాథ్ ఘటనా స్థలిని పరిశీలించి ఆత్మహత్యపై విచారణ చేపట్టారు.



నెత్తి మోతలు..ఇంకెన్నాండ్లు..!

- రేషన్ కోసం పరేషాన్ అవుతున్న గిరిజనం
- బియ్యం కోసం కొండలు..గుట్టలు దాటుతున్న వైనం
- ఏజెన్సీలో కొత్త దుకాణాలపై ఊసెత్తని ప్రభుత్వం
- అదనపు భారంగా మారుతున్న రవాణా ఛార్జీలు
- కొత్తగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజనుల విజ్ఞప్తి

నోట్లోకి బువ్వ పోవాలంటే బియ్యం కావాలి.. ఆ బియ్యం కావాలంటే కొండలు..గుట్టలు ఎక్కాలి.. అనేక వ్యయ ప్రయాసాల కోర్చితే కానీ అది వారి దరికి చేరడం లేదు. ఇదంతా ఏజెన్సీ పరిధిలోని డీఆర్‌డీపోల పరిస్థితి. కొత్త పంచాయతీలు ఏర్పడినా..ఇప్పటికీ పాత వాటిలోనే బియ్యం తీసుకోవడంతో ప్రతి నెలా అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. ఒక్కో పల్లెవాసులు సుమారు 5 నుంచి 10కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ బియ్యం వారి దరికి చేరడం లేదు. కొత్తగా డీఆర్‌డీపోలు ఏర్పాటుచేయాలని పలు డిమాండ్లు వినిపిస్తున్నా.. నిబంధనల పేరుతో అధికార యంత్రాంగం అంతగా దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతవాసులు ప్రతి నెలా బియ్యం కోసం ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తున్నా.. దుకాణాల నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు రవాణా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోందని ఆదివాసీ గిరిజనులు వాపోతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలకు ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రజలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కరోనా ప్రభావం నుంచి ప్రభుత్వం ఉచితంగానే వీటిని అందజేస్తోంది. ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున అందజేస్తుండటంతో అనేక మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ బియ్యం దుబారా అవుతున్నా..గ్రామీణ ప్రాంత పేదలకు మాత్రం ఈ బియ్యమే కడుపు నింపుతోంది. మైదాన ప్రాంతాల్లో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తుండగా.. ఏజెన్సీ ప్రాంతంలో డీఆర్‌డీపోల ద్వారా ఆదివాసీ గిరిజనులకు వీటిని అందజేస్తున్నారు. కానీ మైదాన ప్రాంతాల్లో ప్రభుత్వం కొత్తగా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలకు సులువైన పంపిణీకి శ్రీకారం చుట్టింది. కానీ ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం ఇప్పటికీ పాత పద్ధతినే అనుసరిస్తోంది. 500 రేషన్‌కార్డులు ఉన్న వాటిలో కొత్తగా రేషన్ దుకాణం ఏర్పాటుచేయాలనే నిబంధన ఉండటంతో గిరిజన ప్రాంతాల్లో చిక్కులు వస్తున్నాయి. అక్కడ సరిపడానంత కార్డులు లేకపోవడంతో ఒక గ్రామంలో రేషన్ దుకాణం పెట్టి చుట్టు పక్కల గ్రామీణులంతా అక్కడికి వచ్చి రేషన్ తీసుకునేలా చేశారు. దీంతో బియ్యం తీసుకోవాలంటే లబ్ధిదారులు ప్రతి నెల ఆ గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రతి నెలా అనేక ఇబ్బందులు పడుతూ రేషన్ బియ్యం తీసుకుంటున్నారు.

ఉచితమైనా..రవాణా ఛార్జీ భారం..!

ప్రభుత్వం కొన్ని నెలల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లరేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. గ్రామంలో రేషన్‌దుకాణం ఉన్న వారికి ఇది ఉపయోగకరంగా ఉంది. కానీ రేషన్ దుకాణం లేని వారికి మాత్రం ఆర్థిక భారం తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితి ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతంలోనే కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ పరిధిలో 110 డీఆర్‌డీపోలు ఉండగా వీటి పరిధిలో 70వేల మంది రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల నుంచి రేషన్ దుకాణానికి వెళ్లాలంటే ఆటో, ఇతర వాహనాల ఛార్జీలు ఒక్కొక్కరికి రూ.50 నుంచి రూ.100వరకు ఖర్చవుతోంది. డబ్బులు లేని నిరుపేదలు నెత్తిమోతల మీదనే కాలినడకన ప్రయాణిస్తూ తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం అనేక గూడేలు, తాండలను పంచాయతీలుగా ఏర్పాటుచేసింది. కొన్నింటిలో కొత్తవాటిలోనూ రేషన్ పంపిణీ చేస్తుండగా.. అనేకం పాత పంచాయతీలకే వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా.. పంపిణీ త్వరగా ముగించాలనే ఉద్దేశంతో కొందరు డీలర్లు జనాలకు షరతులు విధిస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంపిణీ చేయాల్సి ఉండగా.. కేవలం మధ్యాహ్నం లోపు వచ్చిన వారికి మాత్రమే పంపిణీ ఉంటుందని చెబుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా ఈ పదిహేను రోజుల్లో ఏదో ఒక రోజు మాత్రమే ఒక గ్రామానికి బియ్యం ఇస్తామని చెబుతుండటంతో అత్యవసర పని ఉన్న వారు సైతం ఆ తేదీన తప్పనిసరిగా బియ్యం కోసం వెళ్లాల్సివస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. మా పంచాయతీల్లోనే కొత్తగా డీఆర్‌డీపోలు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.



గిరిగామ జీసీసీ నుండి సరుకులు మోసుకెళ్తున్న అంబుగాబ గిరిజనులు

మా గ్రామంలో పంపిణీ చేయాలి : భరత్, అంబుగామ, తాంసి మండలం



మా గ్రామం పంచాయతీగా ఏర్పడింది. కానీ బియ్యం కోసం మాత్రం పాత పంచాయతీకే వెళ్లాల్సి వస్తోంది. ప్రతి నెలా 4కిలోమీటర్లు ప్రయాణించి ఆటో ఛార్జీలు చెల్లించి తీసుకురావాల్సి వస్తోంది. మా గ్రామంలో బియ్యం పంపిణీ చేసేందుకు అవసరమైన భవనాలు ఉన్నాయి. అధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలి.

అధికారులకు అర్జీ పెట్టుకోవాలి : రామానందం, డీఎం, జీసీసీ

కొత్తగా రేషన్ దుకాణాలు ఏర్పాటుచేయడం మా పరిధిలో ఉండదు. ఎవరైనా గ్రామస్తులు రేషన్ దుకాణం కావాలంటే రెవెన్యూ డివిజనల్ అధికారికి అర్జీ పెట్టుకోవాలి. వారు పరిశీలించి అనుమతిచ్చేందుకు అవకాశం ఉంటుంది.

ఏప్రిల్ చివరి వరకు కడెం ఆయకట్టుకు నీరందించాలి



నిర్మల్‌టౌన్: ఏప్రిల్ చివరి వరకు కడెం ఆయకట్టుకు సాగు నీరందించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దుర్గం నూతన్ కుమార్, డాకూర్ తిరుపతి వినతిపత్రం అందజేశారు. కడెం ప్రాజెక్టు కింద వరి పొలాలు పండించడం కోసం ఏడు తడుల నీళ్ల వదులుతామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఏడవ తడితో పొలాలు చేతికొచ్చే పరిస్థితి లేదని తెలిపారవు. 8వ తడి నీరు అందిస్తూ ఏప్రిల్ చివరి వరకు పంట చేతికొచ్చేంత వరకు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ ద్వారా రావలసిన నీటిని సక్రమంగా వినియోగించి కడెం ప్రాజెక్టు కింద ఏ ఒక్క ఎకరం ఎండిపోకుండా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు



తలమడుగు: మండలంలోని భరంపూర్, పూనగూడ గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.30లక్షలతో సోమవారం అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. భరంపూర్ గ్రామంలో మంజూరైన ఐదు లక్షలతో సిసి రోడ్డు, రూ.30లక్షలతో పూనగూడ గ్రామం నుండి ఆశ్రమ పాఠశాలకు వరకు సీసీ రోడ్డు పనులను మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొల్లారపు బాబన్న, రావుల నారాయణ, పెందుర్తి మాధవరావు, రఘునాథ్, గంగాధర్, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కుభీర్: మండలంలోని సిరిపెల్లి(హెచ్) గ్రామానికి చెందిన రైతు పబ్బు గణేష్(48) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం మొక్కజొన్న పంటకు నీళ్ల తడి పెట్టడానికి వెళ్లాడు. మోటార్ స్టార్ట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పబ్బు సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.



బదిలీ అధికారిని సన్మానించిన జీఎం



నస్పూర్: ఎస్ఆర్పి ఓసిపిలో గని మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన బ్రహ్మాజీరావు ఆర్‌జీ1 ఏరియా క్వాలిటీ ఇన్చార్జిగా నియమితులై బదిలీపై వెళుతున్న సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. అతని స్థానంలో ఐ.శ్రీనివాస్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పిఓసిపి గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్‌చ ఓసిపి ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, ఏఐటీసీ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం ఐఈడి చిరంజీవిలు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బొంగొని శంకర్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలని వినతి

బేల : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించ పరుస్తూ, ప్రతిష్టకు భంగం కలిగిస్తూ, అవమాన కరమైన, అసభ్యకరమైన పోస్టులను ఎక్స్, ట్విట్టర్ ద్వారా పెడుతున్న నేరస్తులపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి ఎస్సై దివ్యభారతికి ఫిర్యాదు చేశారు. ఎక్స్ ట్విట్టర్ వేదికగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు పెడుతూ సిఎం ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ బాపురావు, కాంగ్రెస్ నాయకులు కన్య రాజు, దర్నె విజయ్, పురుషోత్తం ఉన్నారు.

శివాజీ మహారాజ్ యువతకు ఆదర్శం

బేల : ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర, మహనీయుడి పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకుంటూ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. మండలంలోని పోనాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. హిందూ సామ్రాజ్య స్థాపన కోసం, ధర్మం కోసం ఆయన చేసి కృషి చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు పాటు పడుతూ మెరుగైన సమాజ నిర్మాణానికి బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, దేవన్న, జక్కుల మధుకర్, సతీష్ పవార్, మస్కె తేజరావ్, మంగేష్ ఠాక్రె, విపిన్ ఖోడే పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తాండూర్ : మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ప్రారంభించారు. అక్కడి గిరిజనులు ఇటీవల పోలీసులు నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో భాగంగా రహదారి కావాలని డిసిపి దృష్టికి తీసుకెళ్లారు. నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐదు లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డు పనులు ప్రారంభించారు. మిగతా పంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడావి పరపతిరావు, భగవంత్‌రావు, మాజీ ఉపసర్పంచ్ పరపతిరావు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎస్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రణదివెనగర్ ప్రాథమిక పాఠశాలను సెక్టోరల్ అధికారి జె.నారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అపార్ ఐడి, ఆధార్ నమోదు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. ప్రతి విద్యార్థికి ఆపార్ గుర్తింపు కార్డు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు మనోగణితం ఎక్కువ అభ్యాసం చేయాలని, దానివల్ల గణిత సమస్యలు వేగంగా సాధించవచ్చని సూచించారు. అనంతరం కృత్రిమ మేధ ఆధారిత విద్య అమలు విధానాన్ని పరిశీలించారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి : సీతారామయ్య

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్కే5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నూతన బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. సింగరేణిలో ఇంకో పది సంవత్సరాల్లో చాలా గనులు మూతపడనున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బొగ్గు గనుల చట్టం ప్రకారం గతంలో వలే కొత్త గనులు రావడం లేదని తెలిపారు. కొత్త గనులు కావాలంటే నూతన చట్టం ప్రకారం వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని దక్కించుకోవాలని కేంద్రం చెబుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలంటే వేలంలో పాల్గొనేందుకు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ గెలిచిన తరువాత నవంబర్ 28న కొత్తగూడెంలో డైరెక్టర్ స్థాయి సమావేశం, మార్చి 7న సి అండ్ ఎండి స్థాయి - సమావేశం, మార్చి 8న జెసిసి సమావేశాలు జరిగాయని, ఈ సమావేశాల్లో కార్మికుల ముఖ్య మైన సమస్యలపై చర్చించామని తెలిపారు. అలవెన్సులపై ఆదాయపు పన్ను చెల్లింపు, మారుపేర్లు విజిలెన్స్ బాధితులు డిపెండెంట్‌లకు ఉద్యోగాలు తదితర సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి పడ్డ రూ. 33 వేల కోట్ల వెంటనే చెల్లించి సంస్థను రక్షించాలని కోరామని పేర్కొన్నారు. సంస్థలో రాజకీయ జోక్యాన్ని విడనాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఫిట్ కార్యదర్శి గుడిగంటి నర్సింగ్‌రావు, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మైనింగ్ స్టాఫ్ ఉపాధ్యక్షులు అడ్డు శ్రీనివాస్, నాయకులు సురేష్, నాగేశ్వరరావు, లక్కిరెడ్డి సత్తిరెడ్డి, మాడగొని మల్లేష్, రాజ్ కుమార్, భోగ మధునయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పిప్పర్‌వాడ పాఠశాలలో ఏఐ కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-జైనథ్

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కార్యక్రమాన్ని సోమవారం బోరజ్ మండలం పిప్పర్‌వాడ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ప్రైమరీ, హైస్కూల్స్‌లలో కంప్యూటర్ సిస్టమ్స్, ల్యాబ్ తప్పని సరిగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్న నలుగురు ఉపాధ్యాయులు మిగతా ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ, ఏషియా ఫౌండేషన్ వారి కోఆర్డినేషన్‌తో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడం జరిగిందన్నారు. మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు పిల్లలు ఎవరైతే వెనుకబడి ఉంటారో వారిని గుర్తించి ఏబీసీ కేటగిరీలుగా విభజించి బి,సి కేటగిరి వారిని పది మందిని తీసుకొని వీరికి మాత్రమే ఏఐ ద్వారా బోధన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 16 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ కార్నర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు న్యూట్రిషన్ డేలో భాగంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లలో లభించే పోషకాలు, విటమిన్‌లను వివరించిన తీరును ఆసక్తిగా గమనించారు. ప్రధానోపాధ్యాయులు శశికళను, ఉపాధ్యాయురాలు అనితను, విద్యార్థులను కలెక్టర అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, మాజీ సర్పంచ్ నోముల సంతోష్‌రెడ్డి, బోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.





అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు: కలెక్టర్



ఆదిలాబాద్‌టౌన్: ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, రోజురోజుకూ భానుడి ప్రతాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు ఎవరు కూడా అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వేసవిలో హీట్ వేవ్‌పై సమ్మర్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి వడగాల్పులు నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మానవులు, జంతువులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. వేసవి కాలం నాలుగు నెలలు అప్రమత్తంగా ఉంటూ ఆశా కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి దగ్గర అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. బయటకు వెళితే గొడుగు, తలపై టోపీ పెట్టుకోవాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ శాఖల ద్వారా ప్రతి కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీఓ వినోద్ కుమార్, విద్యాశాఖ అధికారి ప్రణీత, డిఎంహెచ్ఓ నరేందర్, డిఆర్డీఓ, డీపీఓ, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నిర్మల్ రూరల్ : నర్సాపూర్(జి) మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(45) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఏఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..కాల కృత్యాలు తీర్చుకొనేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారి పడ్డాడు. నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీకి విమర్శించే హక్కు లేదు : సురేందర్ రెడ్డి

నస్పూర్: గతంలో బొగ్గు గనుల వేలం వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న ఐఎన్టీయూసీ ప్రస్తుతం వేలంలో పాల్గొనాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు మెమొరాండం ఇవ్వడం కార్మికులను మోసం చేయడమేనని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.4700 కోట్లు లాభాలు వచ్చినా రూ.2400 కోట్లు తగ్గించి రూ.2300 కోట్లకు లాభాల వాటా ఇవ్వడంతో కార్మికులు నష్టపోయారని తెలిపారు. సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల తీరు గత పోరాటం ఈనాడు ఆరాటంగా మారిందని విమర్శించారు. ఎంఎండిఆర్-2015 చట్టం 2015 సంవత్సరంలో పార్లమెంటులో అప్పటి బిజెపి ప్రభుత్వం చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు దానికి అప్పటి టీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారని, టిఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించలేదని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు మాట్లాడటం సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని, సింగరేణి ఉద్యోగులను తప్పుదోవ పట్టించకూడదని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

మొక్కజొన్న పంట దగ్ధం

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని ఫార్డి(బి) గ్రామానికి చెందిన రైతు సాకాలి దేవీలాల్ మొక్క జొన్న సోమవారం దగ్ధమైంది. రైతు తెలపిన వివరాల ప్రకారం తనకున్న వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 288/5లో ఒక్క ఎకరం 27 గుంటల భూమిలో మొక్క జొన్న పంటను సాగుచేశారు. దీంతో మూడు నెలల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చి మొక్కజొన్న పంట పండించారు. దీంతో చివరి దశకు వచ్చిన తరవాత కూలీలతో మొక్కజొన్న పంటను కోత కోసి కుప్పలు వేయగా ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్ ఉంది దీంతో ప్రమాదవశాత్తు ఒక్కసారి షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేటాయి. దీంతో మొక్క జొన్న పంట కాలి బూడిద అయింది. రెవెన్యూ అధికారి నరేష్‌కు సమాచారం అందించగా పంట క్షేత్రాన్ని పరిశీలించి నష్టపోయిన రైతుకు పరిహారం అందేలా చూస్తామన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నవతెలంగాణ-ఉట్నూర్



గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏఓ దామోదర్ స్వామి అధికారులకు సూచించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. పింఛన్, రెండుపడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, ఈఈ తానజీ, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి



నవతెలంగాణ,-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు సమస్యలపై ఎస్పీని ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో సంప్రదించవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ప్రతి సోమవారం ప్రత్యేకంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు పోలీసు ముఖ్య కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ సంబంధిత అధికారులను సమస్య పరిష్కారాలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్‌లో ప్రజల కోసం రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సోమవారం 8 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఫిర్యాదుదారుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సూచనల నుంచి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కడెం

రాజీవ్ యువ వికాసం పథకాన్ని మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం 3.లక్షల వరకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే చర్యలుంటాయని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం 20, 42వ వార్డుల్లో బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించి అక్కడ బ్లీచింగ్ పౌడర్ చల్లారు. బయట చెత్తను వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు. బయట చెత్త పారేసిన వారికి జరిమానా విధించడం జరుగుతుందని ఫ్లెక్సీలను పెట్టారు.

ఉపకులాలకు న్యాయం చేసే వరకూ పోరాటం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని ఎమార్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ అన్నారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లా బ్యాడ్జిలను ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణలో మాతంగ్ తెగకు గ్రూప్ బీలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణకు ముందే గ్రూప్ -2, 3 తదితర పరీక్ష ఫలితాలను ప్రకటించడంతో మాదిగ ఉపకులానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణలో మాతంగ్ ఉపకులానికి సమూచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో జి.కాంతం, రాంప్రసాద్, ఆర్.నర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన లైవ్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని శంకర్‌తండ గ్రామానికి చెందిన ఐటీడీఏ ఏపీఓ జనరల్ జాదవ్ వసంత్ రావు తండ్రి నారాయణ్ రావు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం నవతెలంగాణ జర్నలిస్ట్, లంబాడిలా ఐక్యవేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ వసంత్ రావు, లైవ్ జిల్లా ఇన్‌చార్జి బానోత్ రవీందర్ పరామర్శించారు. వారితో పాటు మాజీ ఎంపీటీసీ జాదవ్ మోహన్ సింగ్, డాక్టర్ విజేష్, అంబాజీ, గ్రామస్తులున్నారు.

మండల ఉపాధ్యక్షుడిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కొత్తపల్లి విలాస్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌తో మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు వెంకట రమణారెడ్డి, గడ్డం నర్సారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నిమ్మ సాయన్న ఉన్నారు.

హామీల అమలుకు ఉద్యమిస్తాం

- కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా, వంటావార్పు



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత డిమాండ్ చేశారు. హామీల అమలుకు ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసేల కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని తీసుకువచ్చిందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీల సమస్యల సాధనకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో 48 గంటల మహాధర్నా, వంటవర్పును కలెక్టరేట్ ఎదుట నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కరం అనేక హామీలతో జీఓను కూడా ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో దాన్ని నిలిపివేశారన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 15 నెలల నుంచి వాటి గురించి ఉసే తీయడం లేదన్నారు. రిటైర్ట్‌మెంట్ బెన్ఫిట్స్ ఇవ్వకుండా బలవంతంగా రిటైర్ట్‌మెంట్ ఇచ్చారన్నారు. కనీస వేతనం రూ. 26 వేలను ఇవ్వాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే అంగన్‌వాడీల వేతనాలు పెంచుతూ నిధులు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు కోర్టు తీర్పులు గ్రాట్యుటీ వర్తింపు, పర్మినెంట్ చేయాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. మినీ టీచర్స్‌కు 10 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, హెల్పర్లను నియమించాలన్నారు. మంత్రి సీతక్క హామీ ప్రకారం రిటైర్ట్‌మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీఓ ఇవ్వాలని ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలతో సమానంగా ఒకపూట బడి మే నెలంతా టీచర్సు, హెల్పర్స్ ఇద్దరికీ సెలవులు నిర్ణయం చేయాలన్నారు. 48 గంటల ధర్నాతో ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, ఎం.గంగన్న, సహాయ కార్యదర్శిలు ఎస్.నవీన్ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలు సునీత, సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్.సురేందర్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్శనాల నాగేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు సుభద్ర, రత్నమాల, ముక్తా, కళావతి, సరిత, పార్వతి సుజాత, భాగిర్త, మంజుల, లక్ష్మీ ప్రియాంక, సుజాత, పార్వతి, మల్లికాంబ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సీసీఐ పునరుద్ధరణపై ప్రకటన చేయించాలి

- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు
- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి



గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ ఫ్యాక్టరీ తుక్కును మాత్రమే వేలం వేస్తున్నమని చెబుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీ పునరుద్ధరణపై సంబంధిత కేంద్ర మంత్రితో ప్రకటన విడుదల చేయించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీలో చురుగ్గా పని చేస్తున్న భగత్ నరేష్, శరత్ మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ఎంపీ సొంత గ్రామమైన జాతర్ల శివాలయంలో ప్రమాణం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తాను చెప్పినవాన్ని అబద్దాలని వారైన ప్రమాణం చేయాలన్నారు. దీనిపై స్పందించకుండా ప్రజలను పక్కదోవ పట్టించడానికి జిమ్మికులు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిసిన విషయాన్ని ఎంపీ నగేష్ గుర్తించాలన్నారు. ఫ్యాక్టరీ టెండర్ ప్రక్రియపై ఉద్యోగులు, అఖిల పక్షం, తాము ఉద్యమిస్తామని ప్రకటించడంతో మార్చి 7న జరగాల్సిన టెండర్‌ను రద్దు చేశారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న ప్రజల కోసం బీఆర్ఎస్ పని చేస్తుందని స్పష్టం చేశారు. సీసీఐ పునరుద్ధరణకు బుధవారం నుంచి అఖిల పక్షంతో కలిసి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపడుతామని పేర్కొన్నారు. సీసీఐ పునరుద్ధరణతో పాటు ఎయిర్ పోర్ట్ విషయంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులతో స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని ఈ సందర్భంగా జోగు రామన్న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, నారాయణ, మహేందర్, పండ్ల శ్రీను, కుమ్ర రాజు, వెంకట్, కార్యకర్తలున్నారు.

మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలి



కుభీర్ : ఉపాధ్యాయుడిని సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కుభీర్

మండలంలో ఉన్న ఆయా పాఠశాల విద్యార్థులకు రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకువచ్చేలా కృషి చేయాలని మండల విద్యాధికారి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని పార్డి(బి) ఎల్‌బీఎం ఉన్నాత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ, హెచ్‌ఎం మాట్లాడుతూ రానున్న మూడు రోజులో నిర్వహించే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకువచ్చి పాఠశాల, తల్లిదండ్రులు, ఉపధ్యాయులకు మంచి పేరు తీసురవాలని కోరారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భోజన్న, చిరంజీవి, మధవ్, మీరా మహేష్, మంగళ, విద్యార్థులున్నారు.

ఖానాపూర్ : మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ అంకం ప్రేంసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా అన్నీ పరీక్షలు రాయాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతకు ముందు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తమ అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, తొంటి శంకర్, జాడి శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, రవి, దీప్తి, శోభారాణి, కిషన్ ప్రసాద్, ఫరాజ్, షఫీ, లక్ష్మణ్‌రావు, చందన, రమేష్, ప్రకాష్, స్వప్న, సృజన, ఝాన్సి, సాయి పాల్గొన్నారు.

ప్రారంభంలో గుర్తిస్తే అంగవైకల్యం రాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లెప్రసీని ప్రారంభ దశలో గుర్తించి చికిత్సలు వస్తే అంగవైకల్యం కలగదని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను ప్రారంభించారు. ముందుగా పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కుష్టు పోస్టర్లు, అవగాహన పత్రాలను విడుదల చేశారు. అనంతరం శాంతినగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి సోమవారం నుంచి 15 రోజుల పాటు సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సర్వే కోసం ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఒంటికి తెల్లని రాగి రంగులో స్పర్శలేని మచ్చలుంటే వెంటనే సిబ్బందికి తెలియజేయాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వారి పక్కన ఆరోగ్యకరమైన వ్యక్తి ఉంటే వారికి కూడా ఈ వ్యాధి సోకుతుందన్నారు. వారం రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది సర్వేలో గుర్తింపుతో పాటు అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని 22 పీహెచ్‌సీలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 1002 బృందాలను ఏర్పాటు చేశామని, వీరిని పర్యవేక్షించడానికి 200 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు.



సర్వే గురించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

15 రోజుల పాటు వీరు ఆయా కాలనీల్లో పర్యటించి అనుమానితులను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలు ఇంటికి వచ్చే ఆరోగ్యకర్తలకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీసీ ప్రోగ్రాం అధికారి గజానన్, అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు వినోద్, డీపీఎంఓ వామన్ రావు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలు చేయొద్దు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసులు రాజ్యాంగబద్ధంగా అనుభవిస్తున్న రిజర్వేషన్లను అభివృద్ధి చెందిన కులాలకు పంచిపెట్టాలని బీజేపీ కుట్రలు చేయడం సరైనది కాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సేడ్మాకి రామారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ సమావేశాలలో ఎంపీ డీకే అరుణ వాల్మీకి కులాలను ఎస్టీలో కలపాలని పార్లమెంట్ సాక్షిగా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. తమ రాజకీయ స్వార్థం కోసం ఆదివాసులకు పూర్తి రిజర్వేషన్లను అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ఐటీడీఏలకు రావాల్సిన బడ్జెట్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఆదివాసుల రిజర్వేషన్ల జోలికి వస్తే యావత్ ఆదివాసీ సమాజం బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గిరిజనులు అనుభవిస్తున్న రిజర్వేషన్లు ఎవరు బిక్షపెట్టలేదని ఆదివాసీ అమరవీరుల ప్రాణత్యాగల వల్ల వచ్చాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి కుమ్ర జైతు, జిల్లా నాయకులు అరక ఓమేష్, ఏఎస్పీ మండల అధ్యక్షులు తొడసం ఇంద్రు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మాల సంఘం సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్‌ను జిల్లా మాల సంక్షేమ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా మాల కులస్థులపై జరుగుతున్న దాడులను కట్టడి చేయాలని సత్వరం బాధితులకు న్యాయం చేయాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులను కూడా అరికెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, బేర దేవన్న, మేకల మల్లన్నముచ్చ రఘు, పాశం రాఘవేంద్ర, సింగరి అశోక్, మేదరి స్వామి, మలపతి సుభాష్, పోశెట్టి ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఎడిటర్స్ సంఘం

జిల్లా నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పత్రిక ఎడిటర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మడప సంతోష్, మహమ్మద్ ఫిరోజ్ ఖాన్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్ కుమార్, ఎల్చెర్‌వార్ సతీష్, రత్నాకర్ ఉన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచి ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు పెన్షన్‌ను పెంచి ఇవ్వాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే రూ.మూడు వందల పెన్షన్ రూ.మూడు వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్‌ను రూ.ఆరువేలకు పెంచి ఈనెల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటి వరకు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తవించలేదన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని, యూడీఐడీ కార్డులను జారీ చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆరీఫా, ఆశన్న, దివ్యాంగులున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం కమల్‌కోట్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విజయ్ కుమార్ రెడ్డి, నరేష్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత మరొకరికి సాయం అందించాలని కోరారు. విజయ్ కుమార్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ముందుకొచ్చి విద్యార్థులకు సాయం అందచేయడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో అదనపు గదులు వంటగది నిర్మాణానికి నిధులు కేటాయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. సంబంధిత మంత్రితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భుజంగా శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ జైసింగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, కర్ణాకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు లింగారెడ్డి, మాజీ ఎంపీపీ వకీల్, పాడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

గంజాయి సాగు చేసిన వ్యక్తికి జైలు

నవతెలంగాణ-జైనూర్

గంజాయి సాగు చేస్తున్న కేసులో సిర్పూర్-యు పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలుతో పాటు రూ.30 వేల జరిమాన విధిస్తూ డిస్టిక్ సెషన్స్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. సిర్పూర్-యు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..గతంలో సిర్పూర్-యు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న విష్ణువర్ధన్ పోలీస్ సిబ్బందితో 24అక్టోబర్2021న మధురతాండ గ్రామ శివారులో పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేశారు. కట్కువార్ రావు సింగ్ తన చేనులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయి పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని, లాభాపేక్షతో పత్తి పంటలో గంజాయిని సాగు చేశాడు. అతనిపై కేసు నమోదు చేసి ప్రస్తుత జైనూర్ సీఐ, సిర్పూర్-యు ఎస్సై సాక్షులను కోర్టులో హాజరుపరచగా పీపీ జగన్ మోహన్ రావు నేరాన్ని రుజురు చేశారు. దీంతో నిందితుడికి మూడు సంవత్సరాలు జైలుతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేల కృషి చేసిన పీపీతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో వివిధ రకాలుగా మోసగించబడ్డ బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపారు. లైంగికదాడి కేసులో బాధించబడ్డ ఆరుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.10000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగికదాడికి గురైన మహిళలు, బాలికలకు అండగా భరోసా సిబ్బంది పని చేస్తున్నారన్నారు. మెడికల్ ఎగ్జామినేషన్‌లో కూడా బాధితులకు అండగా ఉండడం జరిగిందన్నారు. ఎవరైనా బాధితులు ఉంటే 8712670561 నెంబర్ లేదా డయల్ 100 ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. మహిళల రక్షణ కోసమే భరోసా సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ ఇన్‌చార్జి మహిళా ఎస్సై తిరుమల, లీగల్ సపోర్ట్ పర్సన్ శైలజ, డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, సీసీ కిరణ్ పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో ఉకరణాలు



నవతెలంగాణ-జైనూర్

రైతులకు సబ్సిడీ షరతులతో వ్యవసాయ ఉపకరణాలను అందించడం జరుగుతుందని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి వేంకటేష్ అన్నారు. సోమవారం డివిజన్ ఏఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు లింగాపూర్ మండలం రైతులకు వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి, వ్యవసాయ పనులను సులభతరం చేయడానికి, ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకంలో రైతులు తక్కువ ధరకు అధునాతన వ్యవసాయ ఉపకరణాలను పొందొచ్చని తెలిపారు. ఉపకరణాల ధరలు సబ్సిడీ వివరాలకు మండల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ మండల కార్యాలయంలో లభించే ఫారం నింపాలని, అవసరమైన పత్రాలను భూమి పట్టా, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ కాపీ, దరఖాస్తును మండల కార్యాలయంలో సమర్పించాలన్నారు. మార్చి 20 నుంచి 25లోపు దరఖాస్తులను సమర్పించేల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పీఎంశ్రీ పాఠశాలలో 'మాతృవందన'



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చిన్నరాస్పెల్లి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మాతృవందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు గడ్డం సునీత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ సుశీల జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి పూజలు చేశారు. 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజలు విద్యార్థలు చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పరీక్షల ముందు తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు విద్యార్థలకు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఎలాంటి భయం, కంగారు పడకుండా మంచిగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఒత్తిళ్లకు లోను కాకుండా, సంవత్సరం నుండి చదివిన అంశాలను ఏకగ్రతతో రాయాలన్నారు. పాఠశాల దశలో ఉత్తమంగా చదివిన వారికి ఉన్నతమైన స్థాయికి చేరే అవకాశం ఉంటుందని, కష్టపడితే సాధించలేనిదంటు ఏది లేదని తెలిపారు. తల్లిదండ్రుల గొప్పదనం వారు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశయాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పోషం, శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, శంకరయ్య, కిరణ్ కుమార్, మహేశ్వర్, సుమలత, గోపాల్ శంకర్ పాల్గొన్నారు.

ఆడ వెంకటేష్‌కు సన్మానం



నవతెలంగాణ-జైనూర్

ఏజెన్సీ మారుమూల మండలాలలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆడ వెంకటేష్ చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించారు. సోమవారం ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వికాస్ భాటియ ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌ను ఆయన సేవలకు గాను సత్కరించి అభినందించారు. మారుమూల మండలంలో మరిన్ని సేవలు అందించాలని వక్తలు ఆయనకు సూచించారు. వెంకటేష్ పనితీరుపై మండల ప్రజలు అభినందిస్తున్నారు.

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-కౌటాల



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేజీ జిల్లా శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, రెవంత్ రెడ్డి రెండు ప్రభుత్వాలు జిల్లాకు తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ కుమార్ ఉన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుండి 10వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువు ఈ నెల 20 వరకు పొడిగించినట్టు జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గడువు ముగియగా విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు తుది గడువును 20 వరకు పొడిగించినట్లు, మీ సేవా కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

- అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి త్రివేణి
- కలెక్టరేట్ ఎదుట 48 గంటల మహాధర్న



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీ టీచర్లకు హెల్పర్లకు ప్రస్తుత ప్రభుత్వం ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.త్రివేణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రారంభించిన 48 గంటల మహాధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధాన చట్టాన్ని తెచ్చిందన్నారు. ఇది అమలు జరిగితే ఐసీడీఎస్ స్వతంత్రంగా ఉండదని, అనేక మార్పులు చోటుచేసుకుంటాయని, మూతపడే పరిస్థితికి దారితీస్తాయన్నారు. అందుకే ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిని మార్చి అనేక హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఐసీడీఎస్ వ్యతిరేక విధానాల అమలు రాష్ట్రంలో వెంటనే ఆపాలని, ఎన్ఐపీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌కు గత, ప్రస్తుత ప్రభుత్వాల హామీలు, కోర్టు తీర్పులు గ్రాట్యుటీ పర్మినెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం 48 గంటలు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు చారి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, అంజలి, కుమారి, వనిత, మల్లేశ్వరి, షీలా, జయప్రద, రంభ, జ్యోతి, జయ గోల్దార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యం

- ఏఎస్పీ చిత్తరంజన్

నవతెలంగాణ-వాంకిడి

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యమవుతుందని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. సోమవారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి తపన పట్టుదల సమయపాలన ఉంటే విజయానికి ముఖ్య సూత్రాలు అవుతాయన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. పట్టుదలతో ఇప్పుడు నేను ఆసిఫాబాద్ జిల్లాకు ఏఎస్పీగా చేస్తున్నానని తెలిపారు. దీనికి చదువే ప్రధాన కారణమమని వివరించారు. చదువు జ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ప్రతి ఒక్కరు గొప్ప లక్ష్య సాధనకై ఆలోచన చేయాలన్నారు. లక్ష్యం సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముందుకెళ్లాలని సూచించారు. తన మీద తనకు నమ్మకం ఏర్పడ్డప్పుడే అనుకున్నది సాధించగలుగుతారన్నారు. విద్యార్థులు ఎటువంటి భయం ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నటరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



వాంకిడి : విద్యార్థికి ప్యాడ్, వాటర్ బాటిల్ ఇస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్



కెరమెరి : విద్యార్థికి ప్యాడ్, వాటర్ బాటిల్ ఇస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి : చదువుతూనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. సోమవారం మండలంలోని మోడీ ఆశ్రమ బాలికల పాఠశాలలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలకు చెందిన పదవ తరగతి వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, వాటర్ బాటి ళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కటోర శ్రమతోనే లక్ష్యసాధన సాధ్యమన్నారు. ఎలాంటి భయం, ఆందోళన చెందకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు. పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది పది పరీక్షల్లో కెరమెరి మండలాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసు సిబ్బంది ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, ఎస్సై గుంపుల విజయ్ కుమార్, హట్టి, మోడీ ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు నరసయ్య, పంచ పూల, కేజీబీవీ ప్రత్యేకాధికారిని ప్రవీణ, ఉపాధ్యాయులు భరత్ పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీలో శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేసి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రజలకు రోల్ మోడల్‌గా నిలవాలని అంతేగాని ఇలా సభాపతిపై అనుచిత వాక్యాలు చేయడం బాధాకరమన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.70 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ దశలవారీగా నెరవేర్చుతోందని పేర్కొన్నారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోవడంతో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించారని, ఈ నేపథ్యంలోనే ప్రజలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తే వారే బుద్ధి చెప్తారన్నారు. మళ్లీ అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ పగటి కలలు కంటోందని దానిని ప్రజలు తిప్పుకొడతారని స్పష్టం చేశారు. 15 నెలల కాలంలో కేవలం రెండు రోజులు అసెంబ్లీకి వచ్చి రూ.52 లక్ష జీతాన్ని కేసీఆర్ తీసుకున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు దుర్గం సోమయ్య శంకర్ నాయక్, సత్తన్న, జక్కన్న, నిజాం, రవీందర్, రవి నాయక్, అన్నారావు, బాలేష్, మురళి, పరశురాం, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఛాత్రోపాధ్యాయులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకొని దానిని నిత్యజీవితంలో అమలు చేసే విధంగా ప్రయత్నం చేయాలని ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనిధి డైట్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులందరూ ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రికార్డ్స్ రాయాలని, టీచింగ్ ప్రాక్టీస్ చేయాలని, అన్ని సబ్జెక్టులపై మంచి అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ఉత్తమ లక్షణాలు గల ఉపాధ్యాయులుగా తయారవుతారన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని దానికి వన్నెతెచ్చే విధంగా విద్యార్థి దశ నుండి సిద్ధం కావాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అన్ని రకాల ల్యాబులు వినియోగంలో ఉంచాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఛాత్రోపాధ్యాయులు కష్టపడి చదువుతు ఉన్నతంగా రాణించాలన్నారు. యాజమన్యాలు కూడా వారికి సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులకు పలు ప్రశ్నాలు వేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు : కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి ద్వారా వస్తున్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను హెచ్చరించారు. ప్రజావాణిలో భాగంగా ప్రజల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. విభాగల వారిగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. వేసవికాలం నేపథ్యంలో జిల్లా కార్యాలయాల వద్ద తాగునీటి సౌకర్యం ఉంచాలన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వేసవికాలంలో తాగునీటి సమస్యను తీర్చే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంగా కేవీ రాజశేఖర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కేవీ.రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌సీయూ డిపోలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లా కేంద్రంలోని డిపో కేటాయించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంతో పాటు డిపో అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. గతంలో డిపో మేనేజర్ పనిచేసిన విశ్వనాథ్ బోధన్ డిపోకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

అక్రమంగా పశువులు తరలిస్తే కఠిన చర్యలు : ఎస్సై కమలాకర్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. పశువులను వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహనలను తనిఖీలు చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున కౌటాల మండలం నుండి జగిత్యాల జిల్లా రాజారాం పల్లికు అక్రమంగా ఐచర్ వాహనంలో ఏడు పశువులను పట్టుకుని వాహన డ్రైవర్ ధనియాల లచ్చయ్య, పశువుల యజమాని యాగంతాండ్ర సత్తయ్య, వాహన యజమాని షేక్ షాజావుద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ పనిముట్లపై రాయితీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి రావూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డ్, సాయిల్ హెల్త్ కార్డ్ వారి మండల వ్యవసాయ అధికారిని లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని, రాయితీపై వ్యవసాయ పనిముట్లు నాగలి, కల్టివేటరు, రోటవేటరు, ట్రాక్టర్, పనిముట్లు, తైవాన్, స్ప్రేయరు, పవర్, విడర్, పవర్, టిల్లర్, బ్యాటరీస్, స్ప్రేయర్ వంటి పరికరాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని, ఆర్థిక సంవత్సరం 2024-25కి గాను 100శాతం మహిళలకు వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఆణిముత్యాలుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని సింగరేణి హై స్కూల్ కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. సోమవారం స్కూల్‌లో నిర్వహించిన వేణు మనోహర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరై ఉపాధ్యాయులతో కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 ఏండ్ల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన వేణు మనోహర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, హెచ్ఎం రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లరెడ్డి, బాబు నాయక్ పాల్గొన్నారు.

ప్రయివేట్ వ్యక్తుల వేధింపుల నుండి కాపాడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిర్పూర్ (టి) న్యూ కాలనీ వాసుల ఇళ్ల స్థలాలపై ప్రయివేట్ వ్యక్తుల వేధింపుల నుండి కాపాడాలని భారత కమ్యునిస్టుపార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ.చాంద్ పాషా అన్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపినంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) సర్వేనెం. 524 లోని భూమిని ఇండ్ల స్థలాలకోసం కొంతమంది పేదవారికి యజమాని అమ్మాడని ఇది జరిగి 20 సంవత్సరాలు పూర్తయిందన్నారు. అయితే ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఆ స్థలాలలో పేదలు ఇండ్లు నిర్మించుకోలేదని, 2009లో అప్పటి తహసీల్దార్ నోటీసులు ఇవ్వగా కొనుగోలు చేసిన బాండ్ పేపర్లు చూపించారన్నారు. తాజాగా ఈనెల 10న ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకోనున్నట్లు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో పేద ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బండారి తిరుపతి, న్యూకాలని వాసులు శ్రీరంగం, అన్నపూర్ణ, పేరా నందక్కా, డోని నాగుబాయి, కొత్తూరి రమేష్, పందిర్ల సతీష్, ఆయిల్లా సురేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి 12 దరఖాస్తులు

నవతెలంగాణ-తాండూర్



మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన భూ సమస్యల పరిష్కార వేదికలో 12 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు దరఖాస్తులను పరిశీలించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని భూ సమస్య ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారి సుష్మ, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, ఎంపీఓ అనిల్ పాల్గొన్నారు.

రైతు నేస్తం ద్వారా సత్ఫలితాలు

నవతెలంగాణ-జైపూర్



పంటల సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమంతో సత్ఫలితాలు సాధిస్తున్నట్లు భీమారం వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. సోమవారం మండల పార్టీ గ్రామాలకు చెందిన రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధి రైతులు ప్రతి మంగళవారం 10 గంటలకు ప్రారంభమవుతున్న రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ అంశాలపై రీసెర్చ్ సైంటిస్టులు రైతులకి అవసరమయ్యే సమాచారాన్ని, విత్తనాల నుండి పంట చేతికొచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలు తెలియజేస్తూ రైతుల సందేహాలకు నివృత్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

రాగికుంట- కొత్తపేట రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాగికుంట నుంచి కొత్తపేట వరకు రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు, స్కూల్ పిల్లలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు కొండగుర్ల లింగన్న అన్నారు. సోమవారం ఆ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ప్రజలు సర్వే బృందానికి స్థానిక సమస్యలను విన్నవించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, చదువుకోడానికి స్కూల్ కూడా లేదని, ఇందిరమ్మ పథకంలో ప్రతి పేదవానికి ఇల్లు మంజూరు చేయాలంటూ సమస్యలను తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అంబటి లక్ష్మణ్, శాఖ కార్యదర్శి రాజన్న, అన్నుబాయ్, గౌరీబాయ్ పాల్గొన్నారు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నవతెలంగాణ-మందమర్రి

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అందుగులపేట జాతీయ రహదారి పక్కన సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహం ఎవరిదనేది నిర్ధారణ కాలేదు. వివరాలు తెలిసిన వారు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

భవిష్యత్తు దృష్టితో నడుచుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

పాఠశాల విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ సూచించారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవ తరగతి పూర్తితో ఉన్నత విద్యాభ్యాసం పట్ల జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానం కలిగి ఉండి విద్యాభ్యాసం కొనసాగించిన విద్యార్థులు భవిష్యత్తులో రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అక్టోబర్‌లో ఉద్యోగ విరమణ పొందిన మాజీ హెచ్‌ఎం ఆలిష్ మాధుర్యను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మద్దుల సునీత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వారసంతాల వేలంపాట వాయిదా

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీలో సోమవారం ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, ఈఓపీఆర్డీ జలంధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన దిన, వార సంత వేలం పాటలు వాయిదా వేసినట్లు పొనకల్ పంచాయితీ ఈఓ రాహుల్ తెలిపారు. దిన సంతకు 24 మంది, వారసంతకు 45 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారికి వేలంపాట నిర్వహించామని కానీ, సరియైన వేలం పాట మొత్తం రానందున ఈనెల 20కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు డిపాజిట్‌లు తీసుకోవడం, 10 గంటల నుంచి వేలం పాట ఉంటుందన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

కాగజ్‌నగర్‌లో ఆదివారం జరిగిన 6వ జాతీయ స్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తాండూర్ విద్యా భారతి హై స్కూల్‌కు చెందిన సార్ల మోక్షిత్, ఐ.సాత్విక్ గోల్డ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు. తైక్వాండో ప్రెసిడెంట్ సిద్ధమల్ల చిరంజీవి, సెక్రెటరీ భోగ రాజేష్, కోచ్ ఇప్ప శ్రావణి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ సోమవారం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దుర్గం తిరుపతి, ప్రశాంత్, దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కొత్తూరుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ. లక్ష5 వేల విరాళం సమకూరింది. మండల మాజీ ఎంపీపీ మచ్చ శంకర్ రూ.25 వేలు, దేవుని గూడకు చెందిన గోపాల్ రెడ్డి రూ.75 వేలు ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందించారు. నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-మంచిర్యాల



రోగుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక, సామాజిక ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి పర్యవేక్షకులు హరిశ్చందర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ భీష్మలతో కలిసి ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ, సాధారణ, డయాలసిస్ వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు కనీస సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆస్పత్రిలోని పడకలకు సరిపడా దుప్పట్లు అందుబాటులో ఉన్నాయని, ఆస్పత్రిలోని ప్రతి రోగికి దుప్పటి అందించడం జరుగుతుందని, రోగి మారినప్పుడు తప్పనిసరిగా దుప్పటి మార్చడం జరుగుతుందని తెలిపారు. ఆస్పత్రిలో ఓపీ సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని, ఆధార్ కార్డు ఆధారిత హాజరు తీసుకోవడం జరుగుతుందని, వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు సకాలంలో పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత ఆస్పత్రి భవనం పాతది అయిందని, ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో నూతన భవన నిర్మాణం చేపట్టి పనులు పురోగతిలో ఉన్నాయని, 3 నెలల్లో పనులు పూర్తి చేసి ఆస్పత్రిని నూతన భవనంలోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని, తద్వారా మరింత మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పర్యవేక్షిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని, కనీస మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆస్పత్రిలో ప్రతి రోజు దాదాపు 600 మంది ప్రజలు ఓపీ సేవలు పొందుతున్నారని, వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రికి ఒక పేషెంట్‌తో ఒక సహాయకులు రావాలని, వైద్యులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా మెదలాలని తెలిపారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని ప్రజలతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

- స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ



మహిళలను సన్మానించి అవార్డును అందిస్తున్న అతిథులు

నవతెలంగాణ-మందమర్రి

మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం శ్రీ మంజునాథ గార్డెన్‌లో విశిష్ట మహిళ అంబేద్కర్ పురస్కారం 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందని మహిళలు ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడు మహిళా సాధికారిక సాధ్యమవుతుందన్నారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గాజర్ల దేవేందర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి నీరటి రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు అటెండర్ నుంచి అంతరిక్షం వరకు పురుషులతో సమానంగా ఎదుగుతున్నారన్నారు. మగువలకి ప్రోత్సాహం లభిస్తే ఏ స్థాయిలో నైనా రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆయా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 25 మంది మహిళలకి విశిష్ట మహిళా రమాబాయి అంబేద్కర్ పురస్కారం 2025 అవార్డులను అందించారు. చిన్నారులు అమూల్య, బ్రింద, తపస్య, విష్ణు ప్రియ, శార్వాణి బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఉప్పులేటి నరేష్ అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గడప మానస, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, కోకన్వీనర్‌లు కొల్లూరి రవికుమార్, ఆసంపల్లి శ్రీనివాస్, దర్శనాల నవీన్, బండ శాంకరి, ఉప్పులేటి గోపిక, చిలుక శేఖర్, అంతర్పుల మధు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



ఎస్సీ బాయ్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ కోరుట్ల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. అరటి పండ్లు, కోడిగుడ్లు నెలల తరబడి పెట్టడం లేదని, కనీసం వంట చేయడానికి హాస్టల్‌లో గ్యాస్ కూడా లేనటువంటి పరిస్థితి ఉందన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులున్న హాస్టల్లో ఒక్క కిలో నూనె కూడా లేనటువంటి పరిస్థితి ఉందని, విద్యార్థుల పట్ల వార్డెన్ శ్రీనివాస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. విద్యార్థుల కడుపులు కొట్టి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ వార్డెన్ శ్రీనివాస్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మెనూ పాటించినట్లు రికార్డుల్లో తప్పుడు లెక్కలు చూపెడుతున్నారన్నారు. గతంలో మందమర్రిలో హాస్టల్ వార్డెన్‌గా పనిచేసినప్పుడు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో విద్యార్థులు కొట్టుకోవడంతో ఒక విద్యార్థి తీవ్ర గాయాలపాలై చనిపోవడం జరిగిందన్నారు. దీంతో అతన్ని సస్పెండ్ చేశారని, విచారణ జరుగుతున్న సందర్భంలో ఆయనకి మళ్లీ బెల్లంపల్లి ఎస్సీ హాస్టల్లో వార్డెన్‌గా పోస్ట్ ఇవ్వడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. నిర్లక్ష్య వైఖరితో విధులు నిర్వహిస్తున్న వార్డెన్ శ్రీనివాస్‌ను ఏఎస్‌డీడబ్ల్యూఓ, ఎస్సీడీడీ చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎస్సీ విద్యార్థులకు న్యాయం జరగాలంటే తక్షణమే వార్డెన్ శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి అన్నారు. సోమవారం కార్యదర్శి నామాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓసీపీ గనిని హెచ్‌ఎంఎస్ నాయకులు సందర్శించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు కార్మిక సంఘం విఫలమైందని, కేవలం పైరవీలకే పరిమితం అవుతోందన్నారు. ఓసీపీలో సీటీఆర్ వద్ద ఉన్న వాటర్ స్ప్రే పరికరాలు గత కొంత కాలం నుండి పనిచేయడం లేదని, దీని మూలంగా జియల్ బంకర్ మనిషికి మనిషి కనపడని విధంగా విపరీతమైన దుమ్ము ధూళి వస్తుందని, వెంటనే మరమ్మతులు చేయించి వాటర్ స్ప్రే సక్రమంగా పని చేసేలా చేయించాలని విజ్ఞప్తి చేశారు. జియల్ బంకర్ వద్ద రెస్ట్ హాల్, త్రాగునీరు, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. బ్రేక్ టైంలో కార్మికులు పనిని కొనసాగిస్తే వారికి ఓటి భత్యము చెల్లించాలని అన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్నందున అందరికీ ఇన్సెంటీవ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు నోముల బాలయ్య, దుర్గం లక్ష్మణ్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎరుకల రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా భూక్యా లక్ష్మన్ నాయక్, ఆరె సత్యం, ప్రధాన కార్యదర్శి కోట రవీందర్, ఇన్‌చార్జ్‌గా పెట్టెం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఫయాజ్, మెరుగు రమేష్ గౌడ్, కార్యదర్శులుగా గుమ్ముల సాయి కిరణ్, తిరుపతి, అధికార ప్రతినిధిగా ఖాదర్ ఖాన్, సంయుక్త కార్యదర్శిగా కుంటాల లచ్చన్న, ప్రచార కార్యదర్శి టీ.ప్రశాంత్, ముఖ్య సలహాదారుగా తోడేటి రవిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం దిశగా నూతన కార్యవర్గం పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేల కృషి చేస్తామన్నారు. ఐక్యంగా ఉంటూ ముందుకు సాగుతామన్నారు. ఎలాంటి సమయంలోనైన అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

మందుబాబులకు అడ్డాగా మహిళా భవనం



నవతెలంగాణ-మందమర్రి

మండల కేంద్రంలోని షిర్కేలో గల సమ్మక్క-సారలమ్మ మహిళా భవనం మందుబాబులకి అడ్డాగా మారింది. పొద్దుపోయిందంటే చాలు మద్యం సీసాలతో మందుబాబులు మహిళా భవనం వద్దకు చేరుకొని హల్‌చల్ చేస్తున్నారు. తాగినమత్తులో సీసాలను పగలగొట్టి దారివెంబడి పడేస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడాల్సివస్తోందని అటుగా వెళ్లే బాటసారులు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నిధులు నుంచి రూ. 2 కోట్ల 40 లక్షల వ్యయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా హంగు ఆర్భాటాలతో దీనిని నిర్మించింది. స్వయం సహాయక సంఘాలు, మహిళా గ్రూపు సభ్యులు, మెప్మా ఆర్పీలు సమస్యలను చర్చించుకునేందుకు ఈ భవన నిర్మాణం చేపట్టింది. ప్రభుత్వం మారాక వినియోగించకపోవడం, పర్యవేక్షణ లోపంతో ఆకతాయిలకు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు, పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో అనేక చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని వాటిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడంకి చందు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కోటపల్లి మండలం శెట్‌పల్లి గ్రామంలో స్థానిక మత్స్యకారులకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ ఉందని, ఈ చెరువు కూడా కబ్జాకు గురైయిందన్నారు. అంతేగాక ఆ సొసైటీ చెరువు ద్వారా చేపల మీద ఆధారపడి 30 కుటుంబాలు నివాసిస్తున్నాయన్నారు. ఈఏడాది సొసైటీ ద్వారా రూ.2లక్షల 50 వేల చేప పిల్లలు వేసుకున్నారని, ఇద్దరు వ్యక్తులు పైపులు, మోటారు ద్వారా నీళ్ల తీయడంతో నీళ్ల లేక చెరువు ఎండిపోయి చేపలు చనిపోతున్నారన్నారు. దీంతో మత్స్యకారులకు చాలా నష్టం జరుగుతుందని, ఇద్దరు వ్యక్తులకు నీళ్ల తీయొద్దని నీటిపారుదల శాఖ నుంచి నోటీసులిచ్చినప్పటికీ, వాటిని కూడా లెక్కచేయకుండా చెరువు నుంచి మోటరు, పైపుల ద్వారా నీళ్ల తీస్తున్నారన్నారని కలెక్టర్‌కు విన్నవించారు. వారిపై చర్యలు తీసుకుని మత్స్య కారులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మేడి శ్రీనివాస్, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తీర్ణత



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు ప్రణాళికతో చదివితే పదిలో పాస్ అవ్వడం సులభమని పోన్కల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాడ్స్, పెన్స్, పెన్సిల్స్ ఇతర పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు చాలా విలువైనవని, ఉన్నత చదువుల కోసం పదోతరగతి ఉత్తీర్ణత అవ్వడం మొదటి మెట్టని వివరించారు. విద్యార్థులు భయాన్ని వీడి ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం భూతం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరవింద్, అప్పయి సాయి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ క్రీడమైదానం వేదికగా ఆదివారం నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అసోసియేషన్ సెక్రెటరీ ఈ.మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో 100, 400 మీటర్స్ జావలిన్ త్రోలో పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ ఈ.రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ యం.రాజా రమేష్‌లు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో నామని సహస్య జావలిన్ త్రోలో గోల్డ్ మెడల్‌ను సాధించగా, అండర్ 14 బాలుర విభాగంలో జేస్వాల్ జావలిన్ త్రోలో సిల్వర్ మెడల్, వి. సిద్దేశ్వర్ 400 మీటర్స్‌లో బ్రాంజ్ మెడల్‌ను సాధించారన్నారు అండర్-16 బాలికల విభాగంలో ఎం.సింధూజ 100 మీటర్స్ జావలిన్ త్రోలో గోల్డ్ మెడల్, ఒడ్నల రుచిత 400 మీటర్స్‌లో గోల్డ్ మెడల్‌ను సాదించారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సల్పాల సంతోష్ యాదవ్, ఒడ్నాల మల్లేష్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు స్థిర వేతనం చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం అస్థిర వేతనాన్ని చెల్లించాలని దానికి సంబంధించి ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. జిల్లా వైద్యాధికారి సీతారాంకి ఆశావర్కర్లతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000ల స్థిర వేతనం నిర్ణయించాలన్నారు. ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మా, ఆశా జిల్లా నాయకులు అనితా, పంచశీల, భారతీ, నవీన, పంచశీల పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఏడు దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన సబ్ కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పంపించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వెదురు వస్తువులకు భలే గిరాకీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల వారసంతకు వెదురుతో తయారు చేసిన వివిధ గృహోకరణాల వస్తువులకు గిరాకీ పెరిగింది. మండల ప్రజలతో పాటు వివిధ పల్లెల నుంచి వచ్చిన ఆదివాసులు వారాంతపు సంతలో నిత్యావసర వస్తువులతో పాటు వెదురుతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేయడములో నిమగ్నమయ్యారు. ఆదివాసుల పెండ్లిళ్ళ సీజన్ కావడంతో వారి శుభ కార్యాలకు ఈ వెదురుతో తయారు చేసిన వస్తువులను ఉపయోగించడం వారి ఆచార సాంప్రదాయం. వెదురుతో తయారు చేసిన రంగురంగుల చాటలు, చిన్న,పెద్ద గుల్లలు,పెద్ద గంపలను మంచిర్యాల జిల్లా జన్నారం మండలం నుంచి అమ్మకానికి వచ్చాయి. ఈ చేతి వృత్తి వస్తువులు పెళ్లిళ్ల సీజన్ కావడంతో మంచి డిమాండ్ పలుకుతున్నాయని అమ్మకం దారులు పేర్కొన్నారు. ప్రతి పెళ్లిళ్ల సీజన్‌లో వెదురు వస్తువులను అమ్మడానికి వారాంతపు సంతకు రావడం జరుగుతుందన్నారు. పెద్ద గుళ్ళకు రూ.300 నుంచి వాటి పరిమాణాన్ని బట్టి రూ.100 వరకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు.

పట్టాలతో పాటు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణ శివారులో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలతో పాటు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళిని రెడ్డి కోరారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో నిషన్ ఘాట్, 170లో నివాసం ఉంటున్న వారికి మౌళిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ 12 ఏండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న అధికారులు కానీ ప్రభుత్వం కానీ ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్, మౌళిక వసతులు, తాగు నీరు, పట్టాలు ఇవ్వడం లేదన్నారు. అనేకమార్లు ఆందోళన చేసిన ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు. జీఓ నంబర్ 58 ద్వారా పేదలకు పట్టాలతో పాటు సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, కవ్య, లక్ష్మీ వెంకటమ్మ, పుష్ప, గిరి శారధ, సరుబాయి ఉన్నారు.

ప్రజల్లోకి వన్ నేషన్ వన్ ఎలక్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల్లోకి వన్ నేషన్ వన్ ఎలక్షన్ తీసుకువెళ్లేందుకు విస్తృత ప్రచారం చేయడం జరుగుతుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగేల నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో పాటు క్యాబినెట్‌లోనూ తీర్మానం చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని, దశలవారీగా ఎన్నికల నిర్వహించడంతో అధికారులపై కూడా ఒత్తిడి ఉండదన్నారు. ఇందిరా గాంధీ హయాంలో జమిలి ఎన్నికలకు స్వస్తి పలికినట్లు తెలిపారు. అమెరికా లాంటి దేశాల్లో ఒకేసారి ఎన్నికలు జరగడంతో అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నాయన్నారు. కొన్ని రాష్ట్రాలు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరిగితే తమ మనుగడ పోతుందని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి మోడీ వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై క్షేత్రస్థాయి నుండి అభిప్రాయాలు సేకరించేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నరని తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యాశాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కన్వీనర్లు దిగంబర్, మల్లయ్య, ప్రభాకర్, నానయ్య, అరుణ, నారాయణ, సమీర్ గుప్తా, రాజేందర్, కరణ్, తిరుపతి, పెంటూ, వెంకటేష్, వెంకట్, అర్జున్, నగేష్, రాజేష్ తో పాటు 16 మంది కోకన్వీనర్లు, పలు విభాగాల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కోకన్వీనర్ సురేష్, నాయకులు జయరాజ్, ప్రసాద్ గౌడ్, న్యాయవాది దీపక్ పాల్గొన్నారు.

2047లో సికిల్ సెల్ ఎనీమియా అంతమే లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్రంలో 2047 వరకు సికిల్ సెల్ ఎనిమియను అంతం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని బ్లడ్ సెల్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ హీన దిక్షిత్ అన్నారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్ సెల్‌పై జిల్లా స్థాయి టీఓటీ శిక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సికిల్ సెల్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది.. దాన్ని ఎలా కట్టడి చేయాలో మాస్టర్ ట్రైనర్ హెమటలాజీ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక ప్రాజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ హీన దీక్షిత్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనిమియతో అనేక మంది బాధపడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వైద్యులకు తెలియజేయడం జరుగుతుందని, వారు క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. 2047 వరకు రాష్ట్రంలో సికిల్‌సెల్ ఎనిమియ లేకుండా చేయడంలో ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, ఏటీడీఓ అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జే.సంగీత మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత చెడిపోకుండా జాగ్రత్తగా ఉండాలని, మత్తు పదార్థాలు ఒక వ్యాసనంలా మారి జీవితాన్ని నాశనం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కోఆర్డినేటర్ డాక్టర్ కే.రమేష్, క్లినికల్ సైకాలజీ శ్రీకాంత్ సకార్వార్, షీ టీం ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ బి.సుశీల, పి.వాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట 48గంటల మహాధర్నా

నవతెలంగాణ-నస్పూర్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి అన్నారు. అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట 48 గంటల మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు అనేక వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అందుకే మహాధర్నా చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అంగన్వాడీ ఉద్యోగులు అందరినీ ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, మొబైల్ అంగన్వాడి సెంటర్స్‌ను రద్దు చేయాలని, పీఎంశ్రీ నిధులను అంగన్వాడీ కేంద్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానాన్ని అంగన్వాడి కేంద్రాల్లో అమలు చేసే విధానాన్ని విరమించుకోవాలని, రిటైర్మెంట్ అయిన అంగన్వాడి ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ ఇవ్వాలని, మినీ నుండి మేయిన్ అయిన టీచర్లకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల జీతం వెంటనే చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్యలక్ష్మి, మెనూ చార్జీలు పెంచాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ విద్య అందిస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐసీడీఎస్‌కు పూర్తిగా నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తోందని, నూతన విద్యా విధానం పేరుతో అంగన్వాడీ కేంద్రాలను ఎత్తివేసే కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. మహాధర్నాలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ, అనురాధ, మహేశ్వరి, పద్మావతి, విరోనిక, సంధ్య, విక్టోరియా పద్మ, సబిత, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, దేవదాస్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల మద్దతు

అంగన్‌వాడీల మహాధర్నాకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు(మాజీ సర్పంచ్) అశోక్, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి బోడంకి చందు, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చందర్, ఐఆర్పిటి రాష్ట్ర నాయకులు కామెర్ల జయరావు, డిటిఎఫ్ నాయకులు ప్రకాష్, కొండయ్య, శెట్పల్లి హమాలీ కార్మికులు, కేతనపల్లి మున్సిపల్ కార్మికులు మద్దతు పలికారు.



మంచిర్యాల : కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



నిర్మల్ : ధర్నా శిబిరంలో నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

నిర్మల్‌టౌన్ : అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం 48 గంటల ధర్నా, వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.గంగామణి, బొమ్మెన సురేష్ మాట్లాడుతూ అంగన్వాడీలకు రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ఐసిడిఎస్‌కు వ్యతిరేకంగా అత్యంత దుర్మార్గంగా కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయాలని చూడడం అన్యాయమన్నారు. ఈ చర్యలు పేదలైన అంగన్వాడీ టీచర్స్ తీవ్రమైన ప్రభావం పడుతుందని తెలిపారు. ఐసిడిఎస్ వ్యతిరేక విధానాలు రాష్ట్రంలో వెంటనే ఆపాలని, ఎన్ఈపి చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ 48 గంటల ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. వీరికి ఆశా వర్కర్ యూనియన్ నాయకులు చంద్రకళ, భాగ్య, రామలక్ష్మి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా ఉపాధ్యక్షులు గంగామణి, రజియా, విజయ, ప్రసాద, భాగ్య వనజ, జిల్లా సహాయ కార్యదర్శి, భాగ్య, రేష్మ, విజయ, వందన, దేవిక, లావణ్య, రమ్య పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ రెండు రోజుల మహాధర్నాకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిపోయిందని, ప్రజలకు, కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలు అలాగే మిగిలిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే అంగన్వాడీ టీచర్లకు 18000 వేతనం ఇస్తానని చెప్పిన మరిచిపోయారని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి సైతం మద్దతు తెలిపారు.

ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను కేటాయించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ లేఖను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కూశన రాజన్న మాట్లాడుతూ జిల్లాలో జలవనరులున్నా వాటిని సాగుకు యోగ్యంగా మలుచుకోవడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. 2023 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే వార్ధా నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 4,550 కోట్లు అవసరమని, ఈ వ్యయంతో 1,40,742 ఎకరాలకు సాగునీరందించవచ్చని నీటిపారుదలశాఖ ప్రతిపాదించినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. దీనితో పాటు జిల్లాలో కుమురంభీం (అడ), జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వట్టివాగు, ఎర్రవాగు, ఎన్టీఆర్‌సాగర్ ప్రాజెక్టు నుండి రైతులకు పూర్తి స్థాయిలో నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు గాను ఈ బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించడమే కాకుండా, విడుదల చేసి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, సీహెచ్ సాయికృష్ణ, నాయకులు అల్వాల చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న

జడ్జిని కలిసిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లాకు నూతనంగా విచ్చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్ రావు, అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డాక్టర్ పి.శివరాంప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు న్యాయస్థానాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై చర్చించారు. రానున్న లోక్ అదాలత్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ఇరువర్గాల వారిని ఒప్పిస్తూ ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కరించే దిశగా కృషి చేయాలని మాట్లాడారు. ఇరువురు అధికారులు ముందుగా ఎస్పీకి జిల్లాకు స్వాగతం తెలియజేశారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-జన్నారం

ఈనెల 21 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల బాయ్స్, గర్ల్స్, లిటిల్ ఆన్స్ ప్రయివేట్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మూడు కేంద్రాల్లో 620 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 32 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఫ్యాన్లు, టేబుల్లు, కుర్చీలు మంచినీటి సౌకర్యం, డెస్క్ బెంచీలు, మరుగుదొడ్లు, అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్ రెడ్డి ఆశా వర్కర్లకు అనేక హామీలు ఇచ్చారని వాటిని అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ఆరోపించారు. పక్క రాష్ట్రాల్లో ఆశాలకు 18వేల కనీస వేతనం ఇస్తున్నారని, అదే తరహాలో తెలంగాణలో కూడా ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈనెల 19న కలెక్టరేట్ దిగ్బంధనం, 24న అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, మట్టి ఖర్చులు రూ.50 వేలు, ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ, ఏఎన్సీ, పీఎన్సీ తదితర టార్గెట్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని 6 నెలలు మెడికల్ సెలవులు ఇవ్వాలని గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పిఆర్సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. 2022, 2023, 2024 సం.ల లెప్రసీ సర్వే పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని, 2024 మార్చి 3-5 వరకు 3 రోజుల పల్స్ పోలియో డబ్బులు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధా కార్యదర్శి ఎం. సుజాత, సంగీత, లక్ష్మీ, పద్మ శోభ, రాణి, శ్రీదేవి, లావణ్య, శ్రీలత, త్రివేణి పాల్గొన్నారు.

సెక్షన్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రానికి చెందిన ముజిబొద్దీన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నుంచి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందడాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయనను స్థానికులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఇందులో జన్నారం మాజీ ఉప సర్పంచ్ జంగం రవి, యశోద భాస్కర్, హాజరోద్దీన్, కోదురుపాక నరేష్, రాసమళ్ల మునిందర్ గౌడ్, జంగం మల్లేష్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 23న నిర్వహించే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి అన్నారు. జిల్లా కేంద్రంలో వర్ధంతికి సంబంధించిన పోస్టర్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాద్యత పాలకులదేనన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోదురుపాక మహేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

గోనే స్వామి, అతని కూతురు మల్లీశ్వరి ఇంటిని కూల్చివేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టరేట్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ మండలంలో రంగాపేట్ కొత్తగూడెంలో దాదాపు 40 కుటుంబాలు తరతరాలుగా భూ పోరాటం ద్వారా సాధించుకున్న స్థలంలో గోనె స్వామి, కూతురు గోనె మల్లేశ్వరి ఇంటికి నిర్మించుకున్నారు. గ్రామ పంచాయతీలో 2005 నుంచి 2009 వరకు ఇంటి ట్యాక్స్ చెల్లించారని, ప్రభుత్వం కరెంటు, మంచినీళ్లు, రోడ్డు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసిందన్నారు. ఫారెస్ట్ అధికారులు ఇళ్లను కూల్చడం అనైతిక చర్య అన్నారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాయడం సమంజసం కాదన్నారు. ఎఫ్ఆర్ఓ చర్య వల్ల రోడ్డుమీద భయభ్రాంతులతో జీవిస్తున్న స్వామి కుటుంబానికి ఏమైనా హాని జరిగితే ఖానాపూర్ ఎఫ్ఆర్ఓ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. డీఎఫ్ఓతో చర్చించి పరిష్కారం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి రాజేష్, జిల్లా నాయకులు సింగరి వెంకటేష్, ఖానాపూర్ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న, గూట్ల ప్రసాద్, గోగు శేఖర్, రేగుల గంగన్న, మచ్చ కైలాస్, మాన్య శ్రీనివాస్, గోగు భూమక్క, గూట్ల రజిత, నైతం లింగు బాయి పాల్గొన్నారు.



ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నరహరిశర్మ, ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యంల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం దీపారాధన, పుణ్యాహవచనం, నవగ్రహ పూజా, అష్టాదశ కలశ పూజ, లక్ష్మీ గణపతి సహిత చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం భజన బృందంచే భక్తి పాటల కార్యక్రమం చేపట్టారు. భక్తుల పల్లకీ సేవతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, భిక్షపతి గురుస్వామితో పాటు ముఖ్య సలహాదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకుర్ల గ్రామంలో నీటి సమస్యను తీర్చండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



జైనథ్ మండలం ఆకుర్ల గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఆదిలాబాద్ ఏరియా కమిటీ జిల్లా కార్యదర్శి లంక రాఘవులు అన్నారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. నీటి సమస్యతో ప్రజలు, పశువులు చాలా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. నీటిమట్టం పూర్తిగా అడుగంటి పోయిందని, మిషన్ భగీరథ పైపులు చిన్నగా ఉండడంతో నీరు రావడం లేదన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తాత్కాలికంగా నీటి సమస్యను తీర్చాలని విన్నవించారు. శాశ్వత పరిష్కారానికి పెన్‌గంగా నది నుంచి పైపులైన్ వేసి మంచినీటిని పశువులకు ఇతర సౌకర్యాలకు నీటి సమస్యను పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

30న సామల సదాశివ సాహితీ పురస్కారం అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగు సాహితీ సదస్సు, కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో ఈ నెల 30న స్థానిక పద్మశాలి భవన్‌లో సామల సదాశివ సాహితీ పురస్కారం అందజేత కార్యక్రమం నిర్వహించనున్నట్లు సదస్సు అధ్యక్షులు పెంద్యాల కిషన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మామిడాల తిరుపతయ్య, గౌరవాధ్యక్షులు తుమ్మూరి రామ్మోహన్‌రావు, సలహాదారు తాళ్లపల్లి మురళీధర్‌గౌడ్, క్రియాశీలక అధ్యక్షులు కటకం మధూకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారాన్ని ఉగాది పండుగను పురస్కరించుకొని వేద పండితుడు గట్టు గణపతిశర్మకు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గణపతిశర్మ రచించిన విరాట పర్వం ద్విపద కావ్యం, శ్రీలత కోటేశ్వర్‌రావు రచించిన నీలవేణి శతకం పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రముఖ కవి, పండితులు పెంద్యాల కిషన్‌శర్మ రచించిన శ్రీదేవి వైభవం పుస్తక పరిచయ కార్యక్రమం కూడా ఉంటుందని వారు వివరించారు. ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు



నవతెలంగాణ-నార్నూర్

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీఎఓ పీపీ రాథోడ్ రవీందర్ అన్నారు. సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. గ్రామపంచాయితీల్లో నిర్వహించిన 14 విడత సామాజిక తనిఖీలో పనుల్లో జరిగిన పొరపాట్లు, నిధుల దుర్వినియోగం, తదితరాలపై చర్చించారు. జాబ్ కార్డు ఉన్న కూలీలకు ఉపాధి హామీలో ఆయా పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రజా వేదికలో అడిషనల్ పీడీ కుటుంబరావ్, ఏపీడీ కష్ణరావ్, ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ సాయి ప్రసాద్ జాదవ్ సురేష్, ఎస్ఆర్పీ తిరుపతి, ఈసీ సురేష్, టీఏలు సాదిక్, జాదవ్ సచిన్, చౌహాన్ వికాస్, కైలాష్, బాపురావ్, జ్యోతి, లావణ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 49 మంది ముఖ్య పర్యవేక్షకులు, 49 మంది శాఖ అధికారులు, 4 సి సెంటర్ కస్టోడియన్లు, 461 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. 9,189 మంది రెగ్యులర్, 221 మంది అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య - ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్రావు, హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

ట్రస్టు సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

కెఎస్ఆర్ ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మధుసూధన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య అన్నారు. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కోర్వ నవీన్ రెడ్డి న్యాయవాది నెలకొల్పిన కొర్వ నవీన్ రామ క్రిష్ణ రెడ్డి ట్రస్ట్(కెఎస్ఆర్) జాం, హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చించోలి(బి), ధని, ఆలూరు గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, ఇంగ్లీష్ డిక్షనరీ, పరీక్ష సామాగ్రి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే సేవ భావం అలవచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, కరుణా, వివేకానంద రెడ్డి, నాయకులు ఒల్లత్రి నారాయణ రెడ్డి, సాధ ప్రశాంత్, సురేందర్, షఫీ, లింగారెడ్డి, చిన్నయ్య, సాయన్న, రాజేందర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



నవతెలంగాణ-కడెం

సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను జీర్ణించుకోలేక సోషల్ మీడియా వేదికగా రవి పులుసు ఎన్ఆర్ఐ చేసిన వ్యాఖ్యలను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేంకాల శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో రవి పులుసు పై పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పేదల సంక్షేమానికి ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి పునరావృతమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇందులో యూత్ కాంగ్రెస్ నాయకులు తరి గంగాధర్, సాయి కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రజావాణిలో మూడు దరఖాస్తులు

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ శాఖల సంయుక్తంతో పాటు పలు అంశాలపై ఇతర శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మొత్తం మూడు భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. పెద్దనపల్లి, వరిపేట, ముత్యంపల్లి గ్రామాలకు సంబంధించి ముగ్గురు దరఖాస్తులు చేసుకున్నారు. మండల స్థాయి కమిటీలో రెవెన్యూ, పోలీస్ సంయుక్తంగా దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, కాసిపేట, దేవాపూర్ ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, ఎంపీఓ శేఖ్ సఫ్దర్ ఆలీ,



సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అధికారులు పాల్గొన్నారు.

23న సీపీఐ జనరల్ బాడీ సమావేశం



నవతెలంగాణ-తాండూర్

సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని ఈనెల 23న ఉదయం 10 గంటలకు బాశెట్టి గంగారం విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అదెపు రాజమౌళి తెలిపారు. జనరల్ బాడీ సమావేశానికి సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ సమావేశాన్ని విజయవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి కొంకుల రాజేష్, జిల్లా సంస్థ సభ్యులు గుండా చంద్ర మాణిక్యం, మేకల రాజేశం, నాయకులు రత్నం రాజం, కుందేళ్ళ శంకర్, గుండా ప్రదీప్, తిరుమలేష్ పాల్గొన్నారు.

అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు ఇచ్చే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్లో మార్క్‌ఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేసేల చూడాలని, ఆన్‌లైన్ నమోదుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జైనథ్ పీఏసీఎస్ చైర్మెన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి వినతిపత్రం అందించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. 82 దరఖాస్తులు వచ్చాయని, ప్రజలు నమ్మకంతో ఇచ్చే అర్జీల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పేర్కొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులున్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. చట్టం ప్రకారం అడిగిన ప్రతి కూలికి పని ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కూలీల వ్యతిరేక అనేక నిబంధనలు రద్దు చేయాలని అన్నారు. కూలీలకు 200 రోజుల పనిని, రోజు కూలి 600 ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని మంచినీటి సౌకర్యం, టెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. పార, గడ్డపారా గుల్లలు సరఫరా చేయాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి స్వామి, జిల్లా అధ్యక్షులు ఆశన్న, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, పొచ్చన్న పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాలి



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నందున, జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలను చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగం అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వడదెబ్బతో అనారోగ్యానికి గురై ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్ని రకాల మందులు, సెలైన్ బాటిళ్లు, ఓఆర్ఎస్ పొట్లాలు తగినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. జిల్లాలో కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పోనికి కర్రను సమకూర్చుకోవడానికి పొనికి వనాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు డీఆర్డీఓ విజయలక్ష్మిని అభినందించారు. జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిల్లను కలెక్టర్ అధికారులకు అందజేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడంలో భాగంగా స్టీల్ నీళ్ళ సీసాల వైపు మళ్లిన అధికారులను అభినందించారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు.

అగ్నివీర్ నియామకాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

"అగ్నిపథ్" స్కీం క్రింద అగ్ని వీర్ రిక్రూట్మెంట్ ఆర్టిజీ 2025-26కు తెలంగాణలోని 33 జిల్లాల నుండి అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్ఐసీ.ఇన్ అధికారిక వెబ్ సైట్లో ప్రారంభమైందని డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అగ్ని వీర్‌లోని వివిధ కేటగిరీల కింద నియామకాలు జరుగుతాయని ఈ నియామక ప్రక్రియకు మార్చి 12వ తేదీ నుండి ఏప్రిల్ 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీకి ఇంటర్మీడియట్ లో ఎంపీసీ విభాగంలో 50 శాతం మార్కులతో పాసైన విద్యార్థులు అర్హులనిజ అగ్నివీర్ క్లర్క్ కేటగిరి కింద ఇంటర్‌లో ఏదైనా గ్రూపు నుండి 60 శాతం మార్కులతో పాసైన విద్యార్థులు అర్హులని, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కింద 60 శాతం మార్కులతో పదవ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అగ్ని వీర్ రిక్రూట్మెంట్‌లో పాల్గొనే విద్యార్థుల వయస్సు 17 1/2 సంవత్సరాల నుండి 21 సంవత్సరాల వరకు ఉండాలని ఈ నియామక ప్రక్రియ రెండు ఫేజ్‌లలో ఉంటుందని మొదటి ఫేజ్‌లో కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ 200 మార్కులకు ఉంటుందని రెండవ ఫేజ్ లో రిక్రూట్మెంట్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ర్యాలీలో రన్నింగ్, శారీరక పరీక్షలు నిర్వహించబడుతాయని దరఖాస్తు చేసుకోవడానికి రూ. 250 రుసుముంటుందని ఈ పరీక్ష జూన్ లో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఇంటర్మీడియట్ విద్యార్థులు వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-తలమడుగు

ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఉండం, ఖోడద్ గ్రామాల్లో రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మాణ పనులకు బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ సోమవారం భూమి పూజ చేశారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారేశ్వర రెడ్డి, నిట్టడి గంగాధర్, కాటిపెల్లి శ్రీనివాసరెడ్డి, సాకి ఆనంద్, అభిరాంరెడ్డి, ఎల్మ శ్రీనివాసరెడ్డి, మగ్గిడి ప్రకాష్, రవికాంత్, సత్యనారాయణరెడ్డి, మంత్రి స్వామి, వెంకన్న, జావిద్, మహేష్, రాంకిషన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష పాడ్స్ పంపిణీ



నవతెలంగాణ-జైనథ్

భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 21న పరీక్షలు ఉండటంతో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు అలాల్ సాయి సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా చేతుల మీదుగా విద్యార్థులకు పాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల సంతోష్ రెడ్డి, హెచ్‌ఎంలు శశికళ, నవనీత, నేస్తం ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు అలవాటు పడొద్దు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌కి అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, అక్రమ బెట్టింగ్ యాప్స్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన చట్టరిత్య చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగామరి, అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్/గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లు నిర్వహకుల సూచనల మేరకే ఆపరేట్ చేయబడతాయని పేర్కొన్నారు. గేమింగ్ మాటున ప్రమాదకర మాల్‌వేర్ ఉందని, ఫెక్ లింక్స్‌తో వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని, గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆదిలాబాద్ నుంచి ఎయిర్‌పోర్టుకు బస్సు సర్వీస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ శంషాబాద్‌కు డిపో నుంచి రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు, రాత్రి 9:30 గంటలకు బయలుదేరి ఉదయం 4:30కు చేరుకుంటాయన్నారు. తిరుగు ప్రయాణంలో ఎయిర్‌పోర్ట్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం12 గంటలకు, 11:30 గంటలకు బయలుదేరి సాయంత్రం 6:40కి ఆదిలాబాద్ చేరుకుంటాయని పేర్కొన్నారు. ఈ సర్వీసును ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

కేయూ డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించండి

తాండూర్ : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈనెల 28లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కోఆర్డినేటర్ మహమ్మద్ రఫీక్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ చదువుతున్న రెండవ, నాలుగవ, ఆరవ, సెమిస్టర్ విద్యార్థులు ఈ మేరకు నిర్ణయించిన ఫీజులు మీసేవ ద్వారా గాని, ఇంటర్నెట్ సెంటర్ ద్వారా గాని ఆన్‌లైన్‌లో 'ఆక్టోపాడ్' ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు, ఏప్రిల్‌లో జరగనున్న రెగ్యులర్, బ్యాక్లాగ్ పరీక్షల నిమిత్తం కాకతీయ విశ్వవిద్యాలయం ఈ అవకాశాన్ని కల్పించిందని వివరించారు. ఇతర వివరాలకు కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచ్ లో కోఆర్డినేటర్ రఫీక్ గారిని ఈ ఫోన్ నెంబర్ 7013530814, 9959269975లో సంప్రదించాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

నవతెలంగాణ-బేల

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, అక్రమ రవాణాలను పూర్తిగా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం మండలం కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆయన పరిశీలించారు. స్టేషన్ ఆవరణను మొక్కను నాటారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కాగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు కలిగిన ఉన్నందున అశాంతిని కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా స్థానిక ప్రజలను ప్రోత్సహించాలన్నారు. రౌడీ షీట్ ఓపెన్ చేసిన వారిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ ఫణిధర్, సాయినాథ్, ఎస్సైలు దివ్యభారతి, ముజాహిద్, సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ ఉద్యోగులకు విధుల నిర్వహణలో ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తానూరు మండలం బోరిగామ గ్రామంలో రెవెన్యూ ఉద్యోగిపై దాడి ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసు అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-ఖానాపూర్



బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహకులుగా సోమవారం న్యాయవాదులు కామోజీ వేణుగోపాల్ షబ్బీర్ పాషాలు నియమితులయ్యారు. ఈ మేరకు వారు సోమవారం నియామక పత్రం అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అసోసియేషన్ పదవి కాలం ముగియడంతో 2025-26 సంవత్సరానికి బార్ అసోసియేషన్ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి, గైడ్‌లైన్ ప్రకారం నిర్ణీత షెడ్యూల్ తెలంగాణ బార్ కౌన్సిల్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట ఏజీపీ ఆసిఫ్ అలీ సీనియర్ న్యాయవాదులు సురేష్, వెంకట మహేంద్ర, శివ, వెంకటేష్, కమలాకర్, ఖదీర్ ఉన్నారు.